క్లుప్తంగా

తైక్వాండో కిట్ వితరణ


తైక్వాండో కిట్‌ను అందిస్తున్న ధర్మేశ్వర్

పుల్లంపేట : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 2018వ సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న ధర్మేశ్వర్ అదే పాఠశాలకు రూ. 13వేలు విలువచేసే తైక్వాండో కిట్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠేశ్వరరావుల ఆధ్వర్యంలో పాఠశాలకు వితరణ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

రాజంపేట : రాజంపేట శాన్వీ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వాకర్ ఇంటర్నేషనల్ డేను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి సందర్భంగా రాజంపేట పరిసర ప్రాంతాలకు చెందిన పేదలకు చీరలు, పంచ, టవల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన కొండూరు విశ్వనాథరాజు, ఆల్విన్ మాజీ కార్మికనేత సుబ్బరామరాజు, సీఈఓ శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పుల్లంపేట : గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్ పేర్కొన్నారు. అప్పారాజుపేట గ్రామ పంచాయతీలో రూ. 20 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామ అభివృద్ధి కోసం రూ. 20 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. పంచాయతీ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రిజ్వాన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి

రాయచోటి అర్బన్ : పేదలమైన తమకు ఇళ్ల స్థలాలను ఇప్పించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి పారిశుధ్య కార్మికులు విన్నవించారు. మంగళవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేతో వారు మాట్లాడుతూ తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలంటూ కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ కార్మికులందరూ ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్మికుల అర్హతలను పరిశీలించిన తదనంతరం అధికారులు ఇళ్లస్థలాలు మంజూరు చేస్తారంటూ చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు సాంబశివ, ఎస్.శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, విశ్వనాథ నాయక్, రంగారెడ్డితోపాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు, అధికారులతో కలసి సభా భవన నిర్మాణం పనులను పరిశీలించారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ చైతన్య

పెనగలూరు : విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వీఎస్‌కే చైతన్య హెచ్చరించారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు క్రమశిక్షణ, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈవ్‌టీజింగ్ సంఘటనలు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చదువుతోపాటు ఆటల పోటీలలోనూ మంచి ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని, క్రమశిక్షణతో మెలిగినవారు మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఆదర్శప్రాయమైన విద్యార్థి దశ గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ, ఎస్ఐ సుబ్బారెడ్డి, పెనగలూరు పోలీస్ సిబ్బంది, మోడల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ భవన్‌ను నిర్మించండి

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణంలో మైనార్టీ భవన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఆల్‌మేవా రాష్ట్రఅధ్యక్షుడు ఫారూఖ్ డిమాండ్ చేశారు. స్థానిక ఖుర్షీద్ మసీదులో మంగళవారం అన్నమయ్య జిల్లా ఆల్‌మేవా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లాలో మైనార్టీలు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. మైనార్టీల సౌకర్యార్థం ప్రభుత్వం వెంటనే రాయచోటిలో మైనార్టీ భవన్‌ను నిర్మింపచేయాలంటూ కోరారు. ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు జుబేర్ అలీఖాన్ మాట్లాడుతూ దేశ మొదటి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని జాతీయ విద్యాదినోత్సవంగా, మైనార్టీ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆసదుల్లా, నేతలు ఇలియాస్‌బాష, సయ్యద్‌సునీర్, శిబాతుర్ రహిమాన్, జాకీర్, ఇలియాజ్, అహ్మద్, మహ్మద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి సర్వతోముఖాభివృద్ధికి సమష్టి కృషి

- 8వ తేదీలోపు మాండవ్యనది ఆక్రమణలపై సమగ్ర రిపోర్టు ఇవ్వాలి
- మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, పలుశాఖల అధికారులు

రాయచోటి అర్బన్ : రాయచోటి సర్వతోముఖాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తుండడం అభినందనీయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ సభా భవనంలో మంగళవారం చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, కౌన్సిలర్ల సమష్టి కృషితోనే 13, 14 ఫైనాన్స్ నిధులను వినియోగిస్తున్నామన్నారు. కరెంటు బిల్లులు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి నుంచి ముందస్తుగా జీతాలు చెల్లించే స్థితికి చేరుకున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు త్వరలో మరో వెయ్యిమందికి ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో మున్సిపల్ సభాభవనం, క్రికెట్‌స్టేడియం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిభవనాలు, ఆర్టీసిబస్టాండు విస్తరణ పనులు పూర్తయ్యాయన్నారు. కలెక్టరేట్ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో ఇకముందు ఇళ్లు ప్రణాళికాబద్ధంగా నిర్మించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. పట్టణంలో మాండవ్యనదిని ఆక్రమించి నిర్మిస్తున్న అపార్టుమెంట్‌లు, ఇళ్ళకు మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని కౌన్సిలర్లు సాదక్‌అలీ, విజయమ్మలు కమిషనర్ గంగాప్రసాద్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నవంబరు 8వ తేదీలోపు మాండవ్యనది ఆక్రమణలపై తహసీల్దార్, కమిషనర్‌లు వెంటనే స్పందించి అన్ని రకాల సర్వేలు చేయించి సమగ్ర రిపోర్టును సభ ముందు ఉంచడంతో పాటు అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ కోరారు. 30 మంది పారిశుధ్య కార్మికుల నుంచి మున్సిపల్ అధికారులు కొందరు అక్రమంగా డబ్బులు వసూలు చేశారని, తాను సాక్ష్యాలతో సహా నిరూపిస్తానని కౌన్సిలర్ విజయమ్మ అన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ డబ్బులు వసూలు చేసివుంటే వెంటనే విచారించి తగు చర్యలు తీసుకోవాలంటూ కమిషనర్ గంగాప్రసాద్‌ను ఆదేశించారు. కోర్టు విచారణలో ఉన్న మున్సిపల్ బస్టాండు స్థలం అంశంను త్వరగా పరిష్కరించాలంటూ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తాహీర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వాసుపత్రి ప్రహరీ ముందుబాగంలోని పబ్లిక్ టాయిలెట్ల ముందుబాగాన్ని కొందరు బాడుగలకు ఇచ్చుకుని సొమ్ము చేసుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ విజయమ్మ కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ కౌన్సిలర్ ఆరోపణలపై విచారించామని, ప్రైవేటు షాపులకు స్థలం బాడుగకు ఇచ్చిన విషయం వాస్తవమేనన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ శివార్లలోని ఏజీ గార్డెన్, సిబకతుల్లా కాలనీలో బోగస్ పట్టాలపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ ప్రేమంతకుమార్‌ను ఆదేశించారు. నూతనంగా నిర్మించిన సుండుపల్లె రోడ్డుకు పలువీధుల నుంచి వెళ్లే రహదారులకు 5రోజుల్లో ర్యాంపులను నిర్మించాలంటూ కమిషనర్ గంగాప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. సుండుపల్లె రోడ్డుకు నిర్మిస్తున్న సైడ్‌కాలువల నిర్మాణంలో జరుగుతున్న ఆలస్యంపై కౌన్సిలర్లు కొలిమిచాన్‌బాష, షబ్బీర్, గౌస్‌ఖాన్‌లు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి నాటికి శిల్పారామంతోపాటు పట్టణ శివార్లలో నిర్మిస్తున్న నగరవనం పనులు పూర్తి చేయిస్తామన్నారు. షాదీఖానాకు వెంటనే స్థలం కేటాయించాలని, నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీని మున్సిపాలిటీలో విలీనం చేయాలని వైఎస్ఆర్‌సీపీ నేత ఫయాజ్ అహమ్మద్ ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీతోపాటు గొర్లముదివీడు గ్రామాల పరిధిలోని ఏజిగార్డెన్ కాలనీలను కూడా మున్సిపాలిటీలో విలీనం చేయించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. క్లాప్ ఆటోల నిర్వహణకు ఎదురవుతున్న సమస్యలపై ఆసంస్థ ఎండీతో చర్చిస్తామన్నారు. పట్టణ నిరాశ్రయుల కేంద్రం నిర్వాహకులకు బిల్లుల చెల్లింపు విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్‌బాష సభ దృష్టికి తీసుకువచ్చారు. పట్టణం నడిబొడ్డునుండి వెళుతున్న 33 కెవి విద్యుత్‌లైన్‌ను తొలగించి పట్టణం వెలుపలి నుండి తీసుకెళ్ళేలా చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులను పూర్తి చేయాలి

రాయచోటి : రాయచోటి - వేంపల్లి రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాయచోటిలోని తన కార్యాలయంలో ఎన్‌హెచ్ ఏఈ రఘునాథబాబు, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులతో నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో జాతీయ రహదారుల పనుల పురోగతిపై సమీక్షించారు. ఆర్‌కేడీ రోడ్డు, రింగు రోడ్డు రెండువైపులా నాలుగు వరుసల రహదారిగా విస్తరణ, గువ్వలచెరువు ఘాట్ టన్నెల్, రాయచోటి పట్టణంలో ఠాణా వద్ద పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రహదారి విస్తరణ పనులు, చిన్నమండెంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులపై సంబంధిత ఉన్నతాధికారులతో శ్రీకాంత్ రెడ్డి ఫోన్ ద్వారా చర్చించారు. త్వరితగతిన ఈ నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

రాయచోటి టౌన్ : అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లపు రాజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలంటే అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా సమన్వయంతో పని చేస్తేనే సాధ్యమతువుతుందని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని ఇప్పటి నుంచే అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాయచోటి రూరల్ పరిధిలో మొత్తం 2800 పక్కా గృహాలు మంజూరయ్యాయని అయితే ఇప్పటి వరకు 760 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఇందులో హౌసింగ్ సిబ్బంది, అధికారుల అలసత్వం కారణంగా నిర్మాణాలు మందగించాయన్నారు. ఇప్పటికైనా హౌసింగ్ అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఏర్పాట్లు చేసి త్వరగా నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పూరిళ్లు లేకుండా చేశారని ఆయన స్పూర్తితో సీఎం జగన్ అర్హులందరికీ పక్కా ఇళ్లను మంజూరు చేశారని చెప్పారు. ప్రతి గ్రామంలో రెండు, మూడు ఇళ్లు నిర్మితమతున్నాయన్నారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు త్వరతగతిన ఇవ్వాలని సూచించారు. అంతకు ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాస రెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, ఎంపీడీవో మల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, వైస్ ఎంపీపీ జయపాల్‌రెడ్డి, నాయకులు కళావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ఆలయానికి విరాళం అందజేత

సిద్దవటం : మాచుపల్లి గ్రామ పంచాయతీలోని జంబుకోన ఆలయ అభివృద్ధికి వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి తనయుడు మేడా గౌతమ్‌రెడ్డి రూ. 1లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి మాట్లాడుతూ అతిపురాతన మైన జంబుకోన ఆలయ అభివృద్ధికి మేడా గౌతమ్‌రెడ్డి విరాళం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి మల్లు విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు మల్లు పెద్దవెంకటసుబ్బారెడ్డి, గజ్జల బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలపై ప్రచారం

రాజంపేట : కార్గో సేవలపై విస్తృత ప్రచారాన్ని మంగళవారం రాజంపేట ఆర్టీసీ సిబ్బంది నిర్వహించారు. డిపో మేనేజరు గుండాల రమణయ్య నేతృత్వంలో పట్టణంలో పలుషాపుల, షాపింగ్ కాంప్లెక్స్ తదితర వ్యాపార సముదాయంలో ఆర్టీసీ కార్గో బ్రోచర్స్‌ను పంపిణీ చేశారు. కార్గో సేవలను వివరించారు. డోర్ డెలవరీ మాసోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలపై వ్యాపారులు, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రచారం నిర్వహించామన్నారు.

రామాపురంలో ఎస్జీఎఫ్ క్రీడలు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట తెలుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో అండర్- 14, అండర్ -17 త్రోబాల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, పీడీ నరేంద్రకుమార్‌రెడ్డిలు క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్రీడాకారులను ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్ర, పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి రామచంద్ర, ఆయూబ్ అలీఖాన్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉమ్మడి జిల్లా త్రోబాల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ పరిధిలోని 480 మంది బాల బాలికలు క్రీడల్లో పాల్గొన్నట్లు తెలిపారు. బాలుర జట్టులో రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో ఫైనల్స్‌కు చేరిన వారు ఉన్నారు.

మంగంపేట నిర్వాసిత కుటుంబాలకు సహకరించండి


ఏపీఎండీసీ ఎండీతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : మంగంపేట గనుల విస్తరణలో ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎండీ వీజీ వెంకటరెడ్డిని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు కోరారు. మంగళవారం విజయవాడ ఏపీఎండీసీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, మంగంపేట నాయకులు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎండీ వీజీ వెంకటరెడ్డిలతో సమావేశమయ్యారు. తొలుత ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డితో మంగంపేట అగ్రహారం తరలింపు, పెండింగ్‌లో ఉన్న నిర్వాచితుల సమస్యలపై ఎంపీతో మాట్లాడారు. ఆయన సూచనలు మేర ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డితో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, గ్రామస్తులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మంగంపేట ఆర్‌ఆర్-2 తరలింపు, పరిహారం పెంపుదల చేయాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న నిర్వాచిత కుటుంబాలకు ఇవ్వాల్సిన డీజెడ్ 300 టన్నుల బెరైటీస్ ఖనిజం గురించి మంగంపేట గ్రామ పంచాయతీ సమస్యల గురించి ఎండీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, హేమసవర్మ, కొలూరు మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశే జగనన్న లక్ష్యం


వైద్యాధికారులతో మాట్లాడుతున్న సుకుమార్ రెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక మండల ప్రాంగణంలోని సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వారు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1.62 కోట్ల కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో 45 రోజులపాటు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించినట్లు వారు తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, శంకరయ్య, మహేష్ రెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు రాఘవరాజుపురంలో

రైల్వేకోడూరు : మండలంలోని రాఘవరాజుపురం శివాలయం వద్ద నేడు బుధవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల హాజరుకానున్నారని వారు తెలియజేశారు. ప్రజలందరూ పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


రాయచోటి అర్బన్: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల దృశ్యం

రాయచోటి అర్బన్ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని వెంటనే పర్మినెంట్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ 104 వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలలో 36 చట్టాల రూపశిల్పి ఏఐటీయూసీనే అన్నారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసులు, లీలావతి, శ్రీనివాసులు, విశ్వనాథనాయక్, రంగారెడ్డి, నాగేశ్వరి, సుధీర్‌కుమార్, నేతలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, దేశంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఏఐటీయూసీకి దక్కుతుందన్నారు. అనంతరం ఏఐటీయూసీ జెండా ఎగురవేశారు. పోకూరు మురళీ, మునిశేఖర్, వడ్డి లక్ష్మీనారాయణ, పి.రామచంద్రయ్య, దినేష్, బత్తల హరి, కార్మికులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : భవన నిర్మాణ కార్మిక సంఘం 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఏఐటీయుసీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేడుకలలో పట్టణ ఎస్ఐ మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. వేడుకలలో ప్రముఖ న్యాయవాది నలకిరి రెడ్డియ్య, బీసీఐ జిల్లా సహాయ కార్యదర్శి సీ మహేష్, నాయకులు ఎంఎస్ రాయుడు, ఈ సికిందర్, మొహమ్మద్ హుస్సేన్, శ్రీనివాసులు, వీ రమణ, పీ సుబ్రమణ్యం, వెంకటసుబ్బయ్య, నాగభూషణం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ గంగాధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్యలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. సామా గంగయ్య, నాయకులు చిన్న నరసయ్య, మణి, సాయి, శివ, మణికంఠ, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ జెండాను ఎగురవేసి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ, పెనగలూరు మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు ఈరి భాస్కర్, ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఐక్యతా పరుగులో మండలంలోని నీలకంఠ్రావుపేట జెడ్పీ ఉన్నత ఉర్దూ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

పేద ముస్లిం పిల్లలకు ఉచిత వడుగులు

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పేద ముస్లిం పిల్లలకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాజంపేట శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వడుగులు (ఖత్నా) చేయిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌జీ.ఇనాయతుల్లా తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని జానీబాషాపురంలో మంగళవారం పలువురు పేద పిల్లలకు ఉచితంగా వడుగులు చేయించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఒడుగులు చేయించుకున్న పిల్లలకు మంచి జరగాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఇనాయతుల్లా మాట్లాడుతూ ఎవరైనా తమ పిల్లలకు వడుగులు చేయించాలంటే తమను సంప్రదిస్తే వారు చెప్పిన రోజు, వారికి అనుకూలమైన సమయంలో వడుగులు చేయించి ఉచితంగా వస్తువులు కూడా ఇస్తామన్నారు. వివరాలకు 9440415789 నెంబర్‌కు కాల్ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ముజఫర్ అహమ్మద్, బాలికోన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్ఎండీ కరీం, మోసిన్‌ఖాన్, కరీం, జానీ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

రాజంపేట రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కొంత సమయం అనే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో విద్యార్థులకు సామాజిక స్పృహ, పర్యావరణం, వైజ్ఞానిక స్పృహ, దేశభక్తి, రక్తదానం, సేవాభావం, మానవత విలువలపై అవగాహన కల్పించారు. దేశం కోసం, సమాజం కోసం విద్యార్థులు, యువతగా మీరు ఏమి చేస్తారు అనే విషయంపై విద్యార్థులతో మాట్లాడించారు. అనంతరం బాగా మాట్లాడిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు రామాంజనేయులు, సుధాకర్‌రాజు, వై.సుబ్రమణ్యం, వెంకట్, రవిచంద్ర నాయుడు, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పి.వెంకటరమణ, ఎస్.మణి, ఎస్.శరత్‌బాబు, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్


చిట్వేలి: 2కే రన్ దృశ్యం

రాయచోటి అర్బన్ : దేశానికి పటేల్ చేసిన సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సర్దార్ వల్లబాయ్ పటేల్ 148వ జయంతి వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సుమారు 560 సంస్థానాలను విలీనం చేసిన ఘనత వల్లబాయ్ పటేల్‌కే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దేశచరిత్రను, స్వాతంత్ర్యపోరాట యోధుల విశిష్టతను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు రౌనఖ్ హుస్సేన్, జబీవుల్లా, వైఎస్ఆర్‌సిపి నేతలు సుగవాసి శ్యామ్‌కుమార్, రియాజ్ అహమ్మద్, ఫయాజ్ అహ మ్మద్, కొలిమి చాన్‌బాషా, సాదక్‌అలీ, నరసింహారెడ్డి, బుజ్జిబాబు, ఇర్ఫాన్, అన్సాసలీం, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె : భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రార్థనా సమయంలో రాష్ట్రీయ ఏక్తా దివాస్ (భారతదేశ ఐక్యతా దినోత్సవం) ప్రతిజ్ఞను నిర్వహించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు వల్లభాయ్ పటేట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవాం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ - 1, 2 ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవం కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతా పంకజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశానికి చేసిన సేవలను విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటించారు.

సిద్దవటం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 148వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో..

రాజంపేట : ఏఐటీఎస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యతా దినోత్సవంను నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎల్.ఓబులపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ప్రతి ఒక్కరూ సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగుజాడల్లో నడవాలని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో మంగళవారం పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదట పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.


ఓబులవారిపల్లె: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విజయారావు

ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం

చిట్వేలి : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్‌లు జాతీయ ఐక్యతా 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాల నుండి కేకే వడ్డిపల్లి వరకు, అక్కడి నుంచి తిరిగి పాఠశాల వరకు 2 కే రన్ సాగింది.

ఓబులవారిపల్లె : ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి ఎంపీడీఓ విజయారావు పూలమాల వేసి నివాళులర్పించారు.

చిన్నమండెం : మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురష్కరించుకొని నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి ఆయన సేవలను వక్తలు కొనియాడారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మమతను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

నందలూరు (రాజంపేట) : కడప జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ - 17 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని మమత తన ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ నవంబర్ నెల 4, 5, 6వ తేదీలలో నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో మమత పాల్గొనబోతుందన్నారు. మమతను పాఠశాల పీడీ సుస్మిత, పీఈటీ జగన్, ఉపాధ్యాయులు అభినందించారు.